## క్లుప్తంగా

### వృద్ధులకు ఉపకరణాల అందజేత


వృద్ధురాలికి వాకర్ అందజేస్తున్న హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు

పరవాడ: హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు కొనియాడారు. హెల్పేజ్ సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ యూనిట్ ద్వారా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, కలపాక గ్రామా ల్లో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2 చక్రాల కుర్చీలు, 12 చేతి కర్రలు, 8 వాకర్లను గొరుసువానిపాలెం, కలపాక, వెంకటపతిపాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులకు అందజేశారు. నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వృద్ధులకు సేవలు అందించడం ప్రశంసనీయమన్నారు. సంస్థ ప్రతినిధి కేవీ రావు మాట్లాడుతూ తమ సేవలు అవసరమైన వృద్ధులు 14567 హెల్ప్ లైన్ నంబరును సంప్రదించాలని కోరారు.

### కూలిన విద్యుత్ స్తంభం


రోడ్డుపై కూలిన విద్యుత్ స్తంభం వైర్లను సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది

నబ్బువరం: ఆరిపాక గ్రామంలోని టెక్కలిపాలెం జంక్షన్ సమీపంలో ఆదివారం కురిసిన వర్షానికి చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడిపోవడంతో స్తంభం నేలకొరిగింది.దీంతో విద్యుత్ వైర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాయపుర అగ్రహారం, టెక్కలిపాలెం గ్రామాల మీదుగా వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సిబ్బంది వెంటనే స్పందించి కూలిన స్తంభం స్థానంలో క్రేన్ సాయంతో కొత్తది వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. దీనిపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

### మహిళల రక్షణకు పోష్ చట్టం

సీతంపేట: పనిచేసే ప్రదేశాల్లో మహిళలపై వేధింపులు జరగకుండా, వాటి నుంచి రక్షించడానికి భారత ప్రభుత్వం పీవోఎస్‌హెచ్(పోష్) చట్టాన్ని రూపొందించిందని సీఐఐ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ ఉషా పంతుల అన్నారు. ఫ్యూచర్ ఆఫ్ వర్క్ స్పేసెస్ అనే అంశంపై డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె ప్రసంగించారు. పోష్ చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. మహిళా ఉద్యోగులకు సురక్షితమైన పని వాతావరణం కల్పించడం యజమానులకు ఈ చట్టం తప్పనిసరి చేస్తుందన్నారు. లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి సంస్థల్లో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలతో అభ్యంతరకరంగా మాట్లాడిన చట్టం ప్రకారం నేరంగా పరిగణిస్తారని చెప్పారు. చట్టం పరిధిలోకి వచ్చే అంశాలు, ఎలా ఫిర్యాదు చేయాలి, ఏ విధంగా రక్షణ పొందాలి తదితర అంశాలపై డాక్టర్ ఉషా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బుల్లయ్య కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వి.రాధాదేవి, శివజ్యోతి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక సాధనతో మానసిక శాంతి


ఉపన్యసిస్తున్న ఆనంద్‌మార్గ్ ఆచార్య జ్యోతి ప్రకాష్

ఆరిలోవ: యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక సాధనతోనే మానసిక శాంతి లభిస్తుందని ఆనంద్‌మార్గ్ సీనియర్ ఆచార్య జ్యోతి ప్రకాష్ అవదూత తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ ఆధ్యాత్మిక సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలలో ఆనంద్ మార్గ్ ఆశ్రమాల నుంచి వచ్చిన ఆచార్యులు ఇక్కడ ఉచిత యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. వారితో పాటు నగరానికి చెందిన కొందరు సాధకులు కూడా ఈ శిబిరంలో పాల్గొని యోగా సాధన చేశారు. ముగింపు సందర్భంగా ఆచార్య జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఎదుగుదలకు ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవలు కూడా అవసరమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది సన్యాసులు, మరో 150 మంది ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల సభ్యులు పాల్గొన్నారని చెప్పారు.

# ఉప్పపంట వర్షార్పణం


వర్షానికి కరిగిన గట్ల మీద నిల్వ చేసిన ఉప్పు


వర్షాలకు నీట మునిగిన ఉప్పు పంట పొలాలు

- అకాల వర్షంతో మడుల్లో చేరిన నీరు
- లబోదిబో మంటున్న రైతులు

పరవాడ: మండలంలో శని, ఆదివారం కురిసిన అకాల వర్షాలకు ఉప్పుపంట దెబ్బతింది. పంట చేతికి రావాల్సిన సమయంలో కురిసిన వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో 120 ఎకరాల్లో ఉప్పు పంట సాగుచేస్తున్నారు. కొద్ది రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో ఉప్పు పంట చేతికి రాకపోవడమే కాకుండా శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కురిసిన కుండపోత వర్షం కారణంగా పంట పొలాల గట్లపై నిల్వ చేసిన ఉప్పు వర్షం నీటికి కరిగిపోయింది. ప్లాట్ ఫారాలపై నిల్వ చేసిన ఉప్పు కుప్పలు కూడా చాలా వరకు కరిగిపోయాయని రైతులు వాపోయారు.

**పంట చేతికివచ్చిన తరుణంలో..**

ఈ ఏడాది వాతావరణం కాస్తా ఆశాజనకంగా ఉండడంతో రెండు నెలల నుంచి అడపాదడపా ఉప్పు పంట చేతికందుతోంది. ఈ తరుణంలో ఉన్నట్టుండీ వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల కురిసిన అకాల వర్షాలకు తీవ్ర నష్టం సంభవించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మెండుగా కాస్తే ఉప్పు పంట సీజన్ మే నెల వరకు ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన నేపథ్యంలో కురిసిన వర్షం తమ పాలిట శాపంగా మారిందని ఉప్పు రైతులు వాపోయారు.

**ఉప్పు పంటకు నష్టం**

శని, ఆదివారం కురిసిన అకాల వర్షంతో ఉప్పు పంటకు తీవ్ర నష్టం కలిగింది. నేను రెండెకరాల్లో సాగుచేస్తున్న ఉప్పు పంట పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. చేతికందాల్సిన ఉప్పు నీట కరిగిపోయింది. నీరు చేరిన పంట పొలాలను శుభ్రం చేసి మళ్లీ పంటకు ఉపక్రమించడానికి నెల రోజులు పడుతుంది.

– బి.రామకృష్ణ, ఉప్పురైతు, గొరుసువానిపాలెం

**ఖర్చులు పెరుగుతాయి**

వర్షపు నీటిని పొలాల నుంచి బయటకు పంపడం, ఉప్పు మడులను శుభ్రం చేయడం వంటి పనుల నిర్వహణకు కూలీలకు అదనంగా వ్యయం అవుతుంది. ఉప్పు పంట పెట్టుబడులకు ముందే వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తోంది. అకాల వర్షం మా నెత్తిన అదనపు భారం మోపింది. ఉప్పు రైతును ప్రభుత్వం ఆదుకోవాలి.

– కండిపల్లి సత్యారావు, ఉప్పు రైతు, దలాయిపాలెం

## విశేషంగా నిత్య కల్యాణం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు అప్పాజీ, శ్రావణ్ తదితరులు ఈసేవ నిర్వహించారు.

**పబ్లిక్ డిమాండ్**

### వీధిదీపాలు వెలిగించరూ!


వేలాడుతున్న విద్యుత్ దీపం

పరవాడ: నాయుడుపాలెం పంచాయతీలో వీధి లైట్లు పూర్తిస్థాయిలో వెలగడం లేదు. సుమారు 15 వీధి దీపాలు ఉన్నప్పటికీ వాటిలో సగం కూడా వెలగక పోవడంతో అంధకారంలో అలమటిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. మెయిన్ రోడ్డులో ఏర్పాటు చేసిన వీధి దీపాలు అలంకారప్రాయంగా వేలాడుతున్నాయి. జెడ్పీ పాఠశాల సమీపంలోని వీధి దీపం ప్రమాదకరంగా ఉంది. వీధి లైట్ల నిర్వహణపై పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యం వహించడం వల్లే ఇబ్బందులు పడుతున్నామని ఆరోపిస్తున్నారు. వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పరవాడ: పరవాడ-గాజువాక రోడ్డులో గొర్లివానిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ పేర్ల విజయకుమార్(36) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. మృతుడు అచ్యుతాపురం మండలం పూడి గ్రామానికి చెందినవాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పాదచారు ఎల్ల సోము నాయుడు, కారు డ్రైవర్ ముద్దాడ అప్పలరాజులు కేజీహెచ్ లో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. శుక్రవారం రాత్రి పూడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ విజయకుమార్ గాజువాక నుంచి అచ్యుతా పురం వైపు వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడడంతో ఆటో డ్రైవర్, కారు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో నడిచివెళుతున్న సోమునాయుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ విజయకుమార్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

# ఉక్రోషంతోనే ఉత్పత్తి నిలిపివేత


766వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా కార్మికవర్గం ఉద్యమిస్తుందన్న ఉక్రోషంతోనే స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని నిలిపివేసి కార్మికుల జీవితాలతో ఆడుకుంటున్నారని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతన్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 766వ రోజు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరంలో ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును ఎందుకు ఇంత చిన్నచూపు చూస్తోందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణలో భాగంగానే ఉత్పత్తిని నిలిపివేస్తున్నారని, వీరి ప్రయత్నాలు సాగవని హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని రాష్ట్ర ప్రజలు, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు కోరుతున్నారన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో కేంద్రానికి ఉక్కు కార్మికులతో పాటు ఆంధ్రరాష్ట్ర ప్రజలు సైతం తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని మార్చుకోవాలని, పార్లమెంట్‌లో ఉపసంహరణ బిల్లును ప్రవేశ పెట్టాలని, లేనిచో తమ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న తెలుగు సాహితీ సభ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కళాభారతిలో ఆదివారం జరిగిన తెలుగు సాహితీ సభ ఆకట్టుకుంది. ఈ సభను వీఎండీఏ ప్రతినిధులు ఎమ్మెస్ఎన్ రాజు, గుమ్ములూరి రాంబాబు, శేఖర మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం డాక్టర్ గుమ్ములూరి ఇందిరా అధ్యక్షతన వసంత కవనం సాహితీ ప్రసంగాన్ని ప్రముఖ వక్త రాంభట్ల నృసింహ శర్మ చేశారు. వసంతం కోకిల ప్రప్రథమంగా కూస్తూ, పచ్చదనాన్ని ఆహ్లాదకరమైన వాతావరణాన్ని తీసుకువస్తుందన్నారు. సభాధ్యక్షురాలు డాక్టర్ ఇందిరా మాట్లాడుతూ రాబోయే రుతువు వసంతమని తెలిపారు. అనంతరం గుమ్ములూరి రాంబాబు మాట్లాడుతూ ఏప్రిల్ 12 నుంచి 16వ తేదీ వరకూ పైడా కౌశిక్ నాటకోత్సవాలను నిర్వహించనున్నామన్నారు.

## గొప్ప యోధురాలు మల్లు స్వరాజ్యం


స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

పరవాడ: తెలంగాణలో నిజాం అరాచకపాలనకు వ్యతిరేకంగా.. భూస్వాముల చేతుల్లో ఉన్న భూములను పేదలకు అప్పగించడంలో స్వాతంత్ర్య సమర యోధురాలు మల్లు స్వరాజ్యం చేసిన పోరాటం స్ఫూర్తి దాయకమని ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి అన్నారు.స్వాతంత్ర్య సమరయోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని పరవాడలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వరాజ్యం చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ భూస్వామి కుటుంబంలో జన్మించినా పేదల కోసం ఆమె పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారన్నారు. మల్లు స్వరాజ్యం స్ఫూర్తితో శ్రమ జీవులు పోరాటాలను కొనసాగించాలని సీఐటీయూ ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పిట్ల మాణిక్యం, సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటలక్ష్మి, దేముడమ్మ, అప్పలనాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈ-వాహనాలతో కాలుష్యానికి చెక్


ఈ-వాహనాల వినియోగంపై అవగాహన కలిగిస్తున్న విజ్ఞాన్ రెక్టార్ మధుసూదనరావు

అగనంపూడి: కాలుష్యం కట్టడికి విదేశాల్లో విరివిగా ఈ-వాహనాలే వాడుతున్నారని, పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఇది సాధ్యమైందని దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు అన్నారు. ఎలక్ట్రికల్ వాహనాల పోకడలు, సవాళ్లు, అవకాశాలపై కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఐదు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రోజులతో పాటు భవిష్యత్‌లో కూడా ఈ-వాహనాలకు మంచి గిరాకీ ఉంటుందని, వాహనాల వాడకం పెరుగుతుందన్నారు. ఈ వాహనాల పని తీరు బ్యాటరీ సెల్స్ ఆకారం, పరిమాణం, పని తీరుపై ఆధారపడి ఉంటుందన్నారు. మరింత మెరుగు పర్చుకుని వినియోగదారులకు నాణ్యమైన వాహనాలు అందించేందుకు సంస్థలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, కార్యక్రమ కోఆర్డినేటర్లు సుశాంత్‌కుమార్ సాహు, సీహెచ్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# గోతులు పూడ్చారు


ఉప్పు గల్లీల వద్ద మలుపులో ఏర్పడిన గొయ్యి

**సాక్షి ఎఫెక్ట్..**


గోతులను పూడ్చిన తర్వాత విశాలంగా ఉన్న రోడ్డు

పరవాడ: అధికారులు ఎట్టకేలకు స్పందించారు. శిథిలమైన వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం రహదారి మరమ్మతులు చేపట్టారు. దీంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దలాయిపాలెం రహదారి గోతులమయం కావడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యపై 'గోతులు పూడ్చాలి' అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమై కథనానికి ఆర్ అండ్ బీ అధికారులు స్పందించారు. పోలిపల్లి కూడలి నుంచి కలపాక వరకు ఏర్పాటు చేసిన రహదారి మరమ్మతులకు నోచుకోవడం వల్ల కార్మికులు, ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారు. దలాయిపాలెం ఉప్పు గల్లీల వద్ద రోడ్డు మలుపులో ఏర్పడిన పెద్ద గొయ్యి ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. ఈ తరుణంలో గోతులు పూడ్చడంతో ప్రమాదాలు తప్పాయని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ముగిసిన యోగా మహోత్సవాలు


యోగాసనంలో ఎన్‌సీసీ విద్యార్థులు, ప్రజలు


యోగా నేర్పిస్తున్న ఆంధ్రా యూనివర్సిటీ శిక్షకులు

మర్రిపాలెం: మర్రిపాలెం ఆర్ అండ్ బీ జంక్షన్ దరి ఎఫ్‌సీఐ గొడౌన్ సమీపంలోని శ్రీరామచంద్ర మిషన్ ఆశ్రమంలో మూడు రోజుల పాటు నిర్వహించిన యోగా మహోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ విశాఖ మెట్రో జోనల్ కో ఆర్డినేటర్ వి.ఆర్.ఎస్.నాగశర్మ మాట్లాడుతూ శ్రీరామచంద్ర మిషన్, భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సంయుక్తంగా ఈ నెల 17 నుంచి 19 వరకు ఏర్పాటు చేసిన యోగా శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. యోగాసనాలు, ప్రాణాయామం, ముద్రలు, యోగిక్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన శిక్షణలో వెయ్యి మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారని తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ రమేష్, నిష్ణాతులైన వారి విద్యార్థులు శిక్షణ అందించారన్నారు. ఈ కార్యక్రమాన్ని భారత ప్రభుత్వపు ఇనీషియేటివ్ హర్ దిల్ ధ్యాన్, హర్ దిన్ ధ్యాన్ ప్రకారం నిర్వహించామని చెప్పారు. పెద్ద ఎత్తున ప్రజలు, విద్యార్థులు హాజరై ప్రయోజనాన్ని పొందినందుకు, విజయవంతంగా శిబిరం నిర్వహించినందుకు అందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రీరామచంద్ర మిషన్ విశాఖపట్నంలో 30కి పైగా ధ్యాన కేంద్రాలు ఉన్నాయని, ధ్యాన సాధన చేయడానికి లేదా కొనసాగించడానికి 96667 92133, 72075 75964 నంబర్లలో సంప్రదిస్తే వారివారి ప్రాంతాల్లో నిర్వాహకులు సేవలందించే ఏర్పాటు చేస్తామని నాగశర్మ వెల్లడించారు.

### ఘనంగా తోట పోలమాంబ పండగ


పోలమాంబ

గోపాలపట్నం: బాజి జంక్షన్ తోట పోలమాంబ కాలనీలో కొలువైన తోట పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అధిక సంఖ్యలో స్థానికులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. విద్యుద్దీపాలంకరణతో ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. సాయంత్రం ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన పరస వద్ద జనం సందడి చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

## స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం


కోచింగ్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీజీఎం శ్రీనివాసరావు

ఉక్కునగరం: సెక్టార్-1లోని స్టీల్‌క్లబ్‌లో స్విమ్మింగ్ కోచింగ్ క్యాంప్ ప్రారంభమైంది. స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ శిక్షణ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిక్షణలో అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్లబ్ కార్యదర్శి జి. నారాయణదొర మాట్లాడుతూ తమ కమిటీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్, జిమ్‌కు చెందిన కొన్ని వస్తువులు కొనుగోలు చేసి సభ్యులకు అందుబాటులో ఉంచామన్నారు. సభ్యులు కాని వారికి కూడా శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కమిటీ సంయుక్త కార్యదర్శి కె. శ్రీనివాస్, కోశాధికారి ఆర్. సత్యనారాయణ, ప్రతినిధులు కె. సత్యనారాయణ, వీరాస్వామి, కె.ఎల్. నర్సింహం, ఎం. కృష్ణారావు, చిట్టిబాబు, వి.ఎస్.బి. రాజు తదితరులు పాల్గొన్నారు.

## గ్లకోమాపై అవగాహన అవసరం


గ్లకోమా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ ఉష

అగనంపూడి: గ్లకోమా వల్ల శాశ్వత అంధత్వం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని, ఈ విషయంలో అవగాహన కలిగి ఉండాలని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉష అన్నారు. గ్లకోమా (నీటి కాసులు) వారోత్సవాల ముగింపు కార్యక్రమం అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్లకోమా ఆరంభ దశలో కనుగుడ్డు చుట్టూ వలయాలు ఏర్పడడం, కంటి చూపు మందగించడం, కాంతి వంతంగా లేకపోవడం, కంటి చూపు క్రమేపీ తగ్గిపోవడం, కళ్లజోడు తరచూ మార్చాల్సి రావడం, నిలకడ లేకుండా తలనొప్పి రావడం జరుగుతుందన్నారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికైనా గతంలో ఇలాంటి సమస్య వచ్చి ఉంటే వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సమయానికి సరైన చికిత్స జరగని పక్షంలో శాశ్వత అంధత్వం కలుగుతుందన్నారు.

## మాతృమూర్తులకు సన్మానం


మాతృమూర్తులను సత్కరిస్తున్న గీతా మకరందం సభ్యులు

డాబాగార్డెన్స్: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ ట్రాఫిక్ విభాగం డీహెచ్‌టీకి చెందిన గీతా మకరందం సభ్యులు సీహెచ్ మసేను, నక్కా అప్పారావు, జి. ధనరాజు గత ఐదేళ్లుగా మాతృమూర్తుల సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మాతృమూర్తులను సన్మానించారు. బి. దేవుడు, డి. ఎల్లారావు, నర్సింగరావు, పిల్లి రమణ, వాసుపల్లి కోదండరావు, పోలవరపు నూకాలమ్మ దంపతులతో పాటు 40 మంది మాతృమూర్తులను ఘనంగా సత్కరించారు. మాతృదేవోభవ పేరిట జరిగిన ఈ కార్యక్రమం అనంతరం అన్నసమారాధన చేపట్టారు. స్వామి వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## విదేశీ విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విదేశీ విద్యార్థినుల వసతి గృహంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరం నిర్వహించారు. ఎంవీపీ కాలనీలోని వసతిగృహంలోని విద్యార్థినులకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య సిహెచ్.ఆశా ఇమ్మానియల్‌రాజు, వార్డెన్ డాక్టర్ రాజ మాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు


విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలివెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రోగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఎస్.హరనాథ్ పాల్గొన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
✆ 7997958341, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెందుర్తి
✆ 9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com